

స్నేహితుడికి ఆర్థిక సహాయం

కేశంపేట, జనవరి 12: అనారోగ్యంతో మంచానికే పరిమితం అయిన ఓ వ్యక్తికి తోటి స్నేహితులు ఆర్థిక సహాయం అందించి ఉదారతను చాటుకున్నారు. మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామానికి చెందిన వన్నాడ రాజుగౌడ్ కొంతకాలంగా అనారోగ్యానికి గురై మంచానికే పరిమితం అయ్యాడు. తోటి మిత్రుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న క్లాస్ మేట్స్ రమణ గౌడ్, ఎం.డీ. లాయక్, గోపాల్ ముదిరాజ్‌లు తమ మిత్రులతో కలిసి రూ.54వేల నగదును శుక్రవారం రాజుగౌడ్‌కు అందించారు. కార్యక్రమంలో మల్లేష్, మనోహర్ గౌడ్, దాసు, పెద్ద నర్సింలు, శీను పాల్గొన్నారు.



'పతంగుల' సంబురం.. కావొద్దు విషాదం

నిషేధిత చైనా మాంజాతో పొంచి ఉన్న ముప్పు

విచ్చలవిడిగా చైనా మాంజాల విక్రయాలు

గాలిపటాలు ఎగరేయడంలో జాగ్రత్తలు తప్పనిసరి


సంక్రాంతి సెలవులు రావడంతో గాలిపటాల సందడి మొదలైంది. ఎక్కడ చూసినా రంగురంగుల పతంగులు కనువిందు చేస్తున్నాయి. పిల్లలంతా ఒకచోట చేరి వాటిని ఎగురువేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. కానీ, పతంగులను ఎగురవేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదం పొంచి ఉంది. వినోదం కాస్తా విషాదంగా మారే ప్రమాదముంది. విద్యుత్ తీగలకు చిక్కుకున్న గాలిపటాలను తీయడానికి ప్రయత్నించి పలువురు మృతిచెందిన ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. పతంగులను ఎగురవేస్తూ భవనాల పైనుంచి కిందపడి ప్రాణాలు పోగొట్టుకున్న వారూ ఉన్నారు. అందుకే పిల్లలు పతంగులను ఎగురువేసే సమయంలో పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి.



- వివరాలు 7లో

రంగారెడ్డి జిల్లా మున్సిపాలిటీల్లో రాజకీయం వేడిని రగిలిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత పలువురు మున్సిపల్, కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్లను పదవిలో నుంచి దించేందుకు సభ్యులు సన్నద్ధమవుతున్నారు. అయితే, అవిశ్వాస తీర్మానాల్లో సొంత పార్టీతో పాటు విపక్ష సభ్యులు కూడా ఒక్కటి కావడం మరింత ఆసక్తి కలిగిస్తోంది. పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఇప్పటికే సభ్యులు కలెక్టర్, అధికారులకు తీర్మాన కాపీలను కూడా అందించారు. ఇప్పుడు ఆ అవిశ్వాస తీర్మానాలు నెగ్గి పదవి కోల్పోయేదెవరో.. కొత్తగా చైర్మన్ పీఠాలను అధిరోహించేది ఎవరో అన్న ఉత్కంఠ జిల్లా ప్రజలతో పాటు రాజకీయ నాయకుల్లోనూ నెలకొని ఉంది.

అవిశ్వాస సెగలు!



ఇప్పటికే మూడుచోట్ల అవిశ్వాస నోటీసులు

- తుర్కయాంజాల్, షాద్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్‌ను తొలగించేందుకు ఏర్పాట్లు
- తాజాగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సీటుకు ఎసరు
- మేయర్‌పై అవిశ్వాస తీర్మానం.. పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించిన 16 మంది కార్పొరేటర్లు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 12 : జిల్లాలోని మున్సిపాలిటీల్లో అవిశ్వాస సెగలు ఆసక్తి రేపుతున్నాయి. అవిశ్వాస తీర్మానం కోసం అసంతృప్తులు చేస్తున్న రాజకీయం మరింత వేడెక్కుతోంది. గత సర్కార్ హయాంలో ఇబ్బందులు పడిన వారంతా ఏకమై అవిశ్వాసాలను తెరపైకి తెస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర సభ్యులంతా కలిసి బల నిరూపణ కోసం సవాల్ విసురుతున్నారు. చెర్మన్లు, చైర్‌పర్సన్లపై అసంతృప్తి, ఎమ్మెల్యేలతో విభేదాలు, వ్యక్తిగత కారణాలు లాంటి ఎన్నో అంశాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఇప్పటికే మూడు చోట్ల అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మరో రెండుచోట్ల నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పదవీ కాలం మరో ఏడాది మాత్రమే ఉన్నప్పటికీ.. అవిశ్వాస తీర్మానాల జోరు తగ్గడం లేదు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్‌పై కౌన్సిలర్లు ఆవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 24మంది కౌన్సిలర్లకు గాను చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి (కాంగ్రెస్)పై 15 మంది, బీఆర్ఎస్ ఇద్దరు, బీజేపీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రతిపై సంతకాలు చేసి ఈ నెల 8న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. అలాగే ఆదిభట్ల మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక (కాంగ్రెస్), వైస్ చైర్మన్ కోరె కమలమ్మ (బీఆర్ఎస్)లపై తోటి కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులతో పాటు బీజేపీ సభ్యుడు ఒకరు అవిశ్వాస తీర్మానం ప్రతిపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు సంతకాలు చేసి జిల్లా అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు నోటీసు అందించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ (కాంగ్రెస్), వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత (బీఆర్ఎస్) పై అవిశ్వాసం దిశగా అడుగులు వేస్తున్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ చెర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కౌన్సిలర్లు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. చైర్మన్‌పై అసంతృప్తిగా ఉన్న కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరినట్లు తెలిసింది. దీనికి కూడా ఎమ్మెల్యే సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే షాద్‌నగర్‌లో మున్సిపాలిటీలో 28 వార్డులు ఉన్నాయి. ఇందులో సగం పైగా కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్‌పై అసంతృప్తితో ఉన్నారు. వారంతా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి ప్రకారం ఎమ్మెల్యే కూడా సుముఖత వ్యక్తం చేశారని పలువురు కౌన్సిలర్లు తెలిపారు. త్వరలోనే మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తాజాగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సీటుకు ఎసరు పెట్టారు. మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానానికి సభ్యులు ఎత్తుగడలు వేస్తున్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకను కలిసిన 16మంది కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పత్రాన్ని సమర్పించారు.



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్‌పై అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

'చేవెళ్ల-ప్రాణహిత'తో

ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీరు

- గత పాలకుల నిర్లక్ష్యంతో రంగారెడ్డి జిల్లాకు అన్యాయం
- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- చేవెళ్లలో స్వామి వివేకానందుడి విగ్రహం ఆవిష్కరణ

చేవెళ్ల, జనవరి 12 : చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగు, తాగునీరు తీసుకువచ్చేలా కృషి చేస్తామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వివేకానందుడి విగ్రహాన్ని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిలతో కలిసి ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పీకర్ మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు గత పాలకులు అన్యాయం చేశారని అన్నారు. చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల - ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు తీసుకువచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు పాలమూరు ఎత్తిపోతల పథకం రీడిజైన్ చేసి రంగారెడ్డి, వికారాబాద్ ప్రాంతాలకు సాగు నీరందిస్తామని స్పీకర్ తెలిపారు. గత ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం చేయలేకపోయారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో చదువుకున్న యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను సైతం భర్తీ చేస్తామన్నారు. వివేకానందుని జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. యువత స్వామిజీ సందేశాలను తెలుసుకోవాలన్నారు. యువత సన్మార్గంలో ప్రయాణించి దేశ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. పరిపూర్ణ వ్యక్తి కావాలంటే మానసిక వికాసం, ఆలోచనలు, శారీరక, బౌద్ధిక, ఆధ్యాత్మిక శక్తి అవసరమన్నారు. అంతకు ముందు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఆధ్యాత్మిక వేత్త బాస్కర యోగిలు మాట్లాడుతూ దేశ స్థితిగతులను మార్చే గురుతర బాధ్యతను యువత తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాల్లోనే భారత దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ భీంభరత్, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాపరెడ్డి, చేవెళ్ల ఉప సర్పంచ్ గంగి యాదయ్య, ఎంపీటీసీ సున్నపు వసంతం, మాజీ ఎంపీపీలు, విజయ్‌భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజ్, చేవెళ్ల సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు మాలతి, పంచాయతీరాజ్ ఛాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



కడ్తాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రధాని వర్చువల్ సమావేశానికి ఏర్పాట్లు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

కడ్తాల్, జనవరి 12: ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న దేశ వ్యాప్తంగా చెంచులతో ప్రధాని మోదీ నిర్వహించే వర్చువల్ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. కడ్తాల మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతిగృహంలో ఏర్పాటు చేసే వర్చువల్ సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల మండలాల్లోని 11 గ్రామాల నుంచి చెంచు కుటుంబాలు హాజరయ్యేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కడ్తాల మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతిగృహంలో నిర్వహించే వర్చువల్ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరీ దేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ మండలాల అధికారులతో కలిసి ప్రతిమాసింగ్ పరిశీలించారు. వర్చువల్ సమావేశానికి వసతిగృహ ఆవరణలో కావాల్సిన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. వసతిగృహంలో ఇంటర్‌నెట్ సదుపాయం, ఇతర వసతులపై అదనపు కలెక్టర్ ఆరా తీశారు. సమావేశ వేదిక, స్టాల్స్ ఏర్పాటు, వైద్య శిబిరం నిర్వహణ, ప్రొజెక్టర్ల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లోని చెంచు కాలనీల్లో నివసించే వారు 610 మంది ఉన్నారని ప్రతిమాసింగ్ వెల్లడించారు. ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ ఖాతాలు లేనివారికి అందించడం జరుగుతుందన్నారు. చెంచుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక మెడికల్ వాహనాన్ని ప్రారంభిస్తామని వివరించారు. కాగా, వర్చువల్ సమావేశానికి గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులకు సమాచారం అందింది. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో గీత, ఎంపీడీవోలు రామకృష్ణ, ఫారుఖ్‌హుస్సేన్, తహసీల్దార్ ముంతాజ్, ఏవోలు శ్రీలత, అరుణ కుమారి, సీడీపీవో సక్కుబాయి, ఎంపీవో మధుసూదనాచారి, ఏఈలు పరమేశ్, కృష్ణయ్య, హెచ్‌డబ్ల్యూవో బాల్‌రాజ్, డాక్టర్ పరిక్షీత్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం

షాబాద్, జనవరి 12 : షాబాద్ మండలం వైవాలగూడ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ శ్రీనివాసుడి కల్యాణాన్ని కనుల పండువగా శుక్రవారం వేద పండితులు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య, తహసీల్దార్ చినప్పలనాయుడు కల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణాన్ని చూడడానికి భక్తులు ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. స్వామి వారి లడ్డూను వేలంలో రూ.లక్షా 28వేలకు డీసీసీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య కైవసం చేసుకున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

యువత పరిశోధనలు చేపట్టాలి

- కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా
- కన్హా శాంతివనంలో జాతీయ యువజన దినోత్సవం

నందిగామ, జనవరి 12 : స్వయం సమృద్ధి గల ప్రపంచం కోసం యువకులు పరిశోధనలు చేస్తూ కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతివనంలో శుక్రవారం వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ యూత్ యునైట్ కార్యక్రమాన్ని గురూజీ కమలేష్ పటేల్‌తో కలసి ప్రారంభించారు. రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సహకారంతో యూత్ సమ్మిట్‌ను నిర్వహించగా.. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 14,000 వేల మంది, పరోక్షంగా లక్షా 50 వేల మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువత, విద్యార్థులకు కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. హార్ట్‌ఫుల్ సెంటర్‌ను సందర్శించినప్పుడు దాజీ మార్గదర్శకత్వంలో ప్రకృతిని తాకినట్లు అనుభూతి చెందానని, ప్రకృతి అందాలను రక్షించడం అందరి బాధ్యత అని అన్నారు. గురూజీ కమలేష్‌పటేల్ మాట్లాడుతూ తాము చేస్తున్న కార్యక్రమాలకు ప్రభుత్వం సహకారం అందించడం చాలా సంతోషకరమన్నారు. అంతకుముందు ప్యాట్రిసియా గురూజీతో కలిసి ధ్యానమందిరంలో అతిథులు, యువత, విద్యార్థులతో కలిసి 15 నిమిషాల పాటు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ప్యాట్రిసియాకు హార్ట్‌ఫుల్‌నెస్ ఛేంజ్‌మేకర్, ప్రజాసేవకురాలు కింద అవార్డు అందజేశారు.



యువజన దినోత్సవంలో పాల్గొన్న ప్యాట్రిసియా

పంచాయతీ భవనాలు నిర్మించరా!

తాత్కాలిక భవనాలు, అరకొర వసతుల మధ్య కొత్త పంచాయతీలు

- శిథిలావస్థలో కొన్ని పాత పంచాయతీ ఆఫీసులు
- నిధులివ్వని ప్రభుత్వం.. పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు, పాలకవర్గాలు

యాచారం, జనవరి 12 : మండలంలోని నూతనంగా ఏర్పడిన పంచాయతీలకు, పాతబడిన పాత పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణాలు చేయడం లేదు. గత ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటుచేసి చేతులు దులుపుకుందే తప్ప వాటికి పంచాయతీ భవనాలు నిర్మించలేదు. తక్కళ్లపల్లితండా, ధర్మన్నగూడ, అయ్యవారిగూడ, కేస్లీతండాలకు నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. తక్కళ్లపల్లి తండాలో రూ.20లక్షలతో ఆరునెలల కింద భవన నిర్మాణం చేపట్టినా పిల్లర్లకే పరిమితమైంది. ధర్మన్నగూడలో పంచాయతీ భవనానికి మూడేళ్లుగా సర్పంచ్ బాషయ్య అధికారుల చుట్టూ తిరుగుతున్నా గ్రామంలో ప్రభుత్వ భూమిలేక భవన నిర్మాణం చేయడం లేదు. అయితే ప్రైవేట్ భూమి కొని నిర్మాణం చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. బీసీ కమ్యూనిటీ హాల్‌ను తాత్కాలికంగా పంచాయతీ భవనంగా వాడుకుంటున్నారు. ఇదే భవనాన్ని కూల్చి రూ.50లక్షలతో కింద విశాలంగా కట్టి ఒకటో అంతస్థులో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని స్థానికులు చెప్పారు. కేస్లీతండాలో కార్యాలయ నిర్మాణానికి స్థలం నిర్మాణాన్ని చేపట్టలేదు. అయ్యవారిగూడలో ఇరుకైన బీసీ కమ్యూనిటీ హాల్‌లో పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. ఇక్కడ ఖాళీ స్థలం ఉన్నా పంచాయతీ భవనం కట్టేందుకు అధికారులు నిధులు విడుదల చేయడం లేదు. తాటిపర్తిలో చాలాకాలంగా చిన్న గదిలో పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. నందివనపర్తి పంచాయతీ భవనం ఇరుకైన గదిలో ఏళ్ల తరబడి కొనసాగుతోంది. ఇది కూడా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుత అవసరాలకు సరిపడా కార్యాయాన్ని విస్తరించాలని గ్రామస్థులు, పంచాయతీ సభ్యులు కోరుతున్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పంచాయతీలకు భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేసి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ధర్మన్నగూడ పంచాయతీ భవనం

పంచాయతీ భవనానికి నిధులివ్వాలి



గ్రామంలో పంచాయతీ భవనం కట్టడానికి గ్రామకంఠం, అసైన్డ్ భూమి లేదు. నేడున్న భవనాన్ని కూల్చి కొంత ముందుకు జరిపి భవనం కట్టడానికి ప్రభుత్వం రూ.50లక్షలు ఇస్తే సమస్య తీరుతుంది. దీనిపై నేను ముఖ్యమంత్రిని కలిసి సమస్య వివరించి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తా.

- భాషయ్య, సర్పంచ్, ధర్మన్నగూడ

ఓ చిన్న గదిలో కార్యాలయం ఉంది



మాది మారుమూల గ్రామం. ఆదాయం తక్కువ. నేడున్న భవనం చిన్న గది. పురాతన కాలంలో దీన్ని నిర్మించారు. ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ.40 లక్షలు ఇస్తే బాగుంటుంది. గత ప్రభుత్వంలో భవన నిర్మాణంపై అధికారులను కోరినా పట్టించుకోలేదు.

- దూస రమేష్, సర్పంచ్, తాటిపర్తి

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్తు


ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీతో జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

యాలాల, జనవరి 12: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనతోనే మాదిగల భవిష్యత్తు మెరుగుపడుతుందని ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జున్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక సమావేశాన్ని మండల ఇన్‌చార్జి డప్పు మహేందర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ యాలాల మండల అధ్యక్షుడిగా మేట్లి సూర్యప్రకాష్, అధికార ప్రతినిధిగా కోళ్ళ కృష్ణ, ఉప అధ్యక్షులుగా గొట్లపల్లి నరేష్, వడ్ల రాములు, ప్రధాన కార్యదర్శి కుమ్మరిపల్లి నవీన్, కార్యదర్శులుగా మలిగిరి నర్సింహులు, పోసాని సాయిలు, మెట్లు నరేందర్, సలహాదారులుగా మేట్లి కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా పకీరప్ప, బలరాం, మల్లేషం, ప్రవీణ్, నరేష్, రాజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుగ్గప్ప, జిల్లా నాయకులు శ్రీశైలం మాదిగ పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో ఎన్నికల స్పెషల్ క్యాంపెయిన్

● ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా



పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

తాండూరు, జనవరి 12: జనవరి 6వ తేదీన వెలువడిన ఎన్నికల ముసాయిదా ఓటరు లిస్ట్ పరిశీలించి అభ్యంతరాలు, సలహాలు ఇవ్వాలని ఆర్డీవో శ్రీనివాస్‌రావు కోరారు. ఆర్డీవో కార్యాలయంలో గురువారం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు బీఎల్‌వో వద్ద దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20, 21వ తేదీల్లో ఎన్నికల స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజులు బూత్‌లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు తారాసింగ్, మునీరుద్దిన్ ఉన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

మేడ్చల్ టౌన్, జనవరి 12: ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎంఆర్ కళాశాల వైస్‌చైర్మన్ భూపాల్‌రెడ్డి అన్నారు. కళాశాలలో శుక్రవారం బీటెక్ విద్యార్థులకు నేషనల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో రాణించదలచిన విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తారని, ఇలాంటి వారు కేవలం ఉద్యోగాలకు పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా మారి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ కేవీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రంగోళి, గాలిపటాల పోటీలు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి డిబేట్‌లో వికారాబాద్ విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జేజే ప్రవీణ్ కుమార్

వికారాబాద్, జనవరి 4: జగద్గిర్‌గుట్ట బాలికల పాఠశాల షట్కేసర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి డిబేట్ కార్యక్రమంలో వికారాబాద్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర స్థాయిలో గురుకుల పాఠశాల నుంచి ఏడవ తరగతి చదువుతున్న వివేకావర్ధన్ ప్రతిభ కనబర్చి మొదటి స్థానం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జేజే ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు వివేక్‌ని అభినందించారు.



యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

విద్యలో అగ్రగామిగా నిలవాలి

» స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జనవరి 12: తెలంగాణ రాష్ట్రంలో వికారాబాద్ జిల్లాను విద్యలో అగ్రగామిగా నిలవాలని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు. పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లా విద్యా వ్యవస్థకు కావాల్సిన నిధులు తేవడానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బడుగు, బలహీన వర్గాల పిల్లలు, ఆర్థికంగా కృంగిపోయిన వారి పిల్లలు మాత్రమే చదువుతున్నారని వారి అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకట్ రత్నం, కోశాధికారి మోయిజ్ ఖాన్, జిల్లా శశిధర్, కార్యదర్శులు పవన్‌కుమార్, కృష్ణవేణి, నీలమ్మ, రాములు, రవీందర్, అజయ్ కుమార్, ప్రభాకర్, పరమేశ్, అనిల్, నర్సింహులు, ప్రభాకర్, పరమేశ్, శేఖర్ రాజేష్ పాల్గొన్నారు.



సంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

ఘట్‌కేసర్, జనవరి 12: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీఎస్ అధికారి బోయల్ డేవిస్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లోని రావ్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు తదితర విభాగాల్లో ప్రావీణ్యం పొందాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ వి.శేషగిరిరావు, ప్రొఫెసర్ షకీల్ అహ్మద్, విధుర లెర్నింగ్ సీఈవో ఆదిత్యకుమార్, బాల్‌రాజ్‌నాయుడు, సీఏ అశోక్‌రెడ్డి, పాఠశాల ఛైర్మన్ రామానాయుడు, సీఈవో సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం శ్రీరంజని, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న హరిప్రియ, రామ్మోహన్

కలెక్టరేట్‌లో ముగ్గుల పోటీలు

మేడ్చల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ శాఖల మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొని ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను డీఆర్‌వో హరిప్రియ, ఏవో రాంమోహన్‌లు ప్రారంభించి పరిశీలించారు. ముగ్గుల పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి జనవరి 26న గణతంత్ర వేడుకల సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.



తాండూరులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్

విపత్తుల రక్షణపై ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్

తాండూరు, జనవరి 12: ఆకస్మిక విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఎన్డీఆర్‌ఎఫ్ అదనపు ఎస్పీ దామోదర్ షింగ్ బృందం శుక్రవారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మానవ తప్పిదం లేదా ప్రకృతి వల్ల సంభవించే విపత్తులు అగ్ని ప్రమాదాలు, వరదలు సంభవిస్తే ఎలా కాపాడుకోవాలి? వాటిపై ప్రయోగాత్మకంగా ప్రదర్శనలు చేశారు. విపత్తులు సంభవించినప్పుడు అప్రమత్తంతో రక్షణ పొందవచ్చునని ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ పాల్గొన్నారు.



కేశంపేటలో రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్ ఇస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్

కేశంపేట, జనవరి 12: షాద్‌నగర్ నుంచి ఆమనగల్లు డబుల్ రోడ్డు విస్తరణలో భాగంగా.. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్ చేశారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ డీఈ రవీంద్ర కుమార్, ఏఈ రవితేజ నేతృత్వంలో కాకునూర్ చౌరస్తా నుంచి దళితవాడ వరకు ఉన్న ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారు. రోడ్డును 50 ఫీట్ల మేర విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. విస్తరణ పనులను స్థానిక సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 77 కిలోల గంజాయి లభ్యం

» ఎక్సైజ్, ఆర్‌పీఎఫ్ పోలీసుల తనిఖీ.. స్వాధీనం
» బెర్త్‌పై బెడ్‌కవర్‌లో వేసుకుని గంజాయి తరలింపు
» నలుగురు నిందితుల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు

వికారాబాద్, జనవరి 12: ఒకప్పుడు గంజాయిని తరలించాలంటే బ్యాగులు, సూట్‌కేసులు, లేదా డబ్బాలలో పెట్టి తరలించే వాళ్లను చూశాం... కానీ ఇక్కడ ఏకంగా ఏసీ బోగీలో దర్జాగా వారికి కేటాయించిన బెర్త్‌పై బెడ్‌లా వేసుకుని తరలించారు గంజాయి దొంగలు. ఒడిశా నుంచి ముంబయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో ఎక్సైజ్, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఒడిశా నుంచి ముంబయి వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్నారని పక్కా సమాచారం రావడంతో శుక్రవారం మధ్యాహ్నం 1గంటల ప్రాంతంలో వికారాబాద్ జంక్షన్‌లో రైలును నిలిపి (రైలు ఇక్కడ ఆగదు) తనిఖీలు చేపట్టారు. ఏసీ బోగీలో పలసా నుంచి పూణె వెళ్తున్న ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులు లడ్విన్ ఆనంద్, మున్నా వర్దన్, అజిత్ రాయ్, సామియల్ రైకాలు 77 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వారు బెర్త్‌పై మరో బెడ్‌కవర్‌లో గంజాయిని ఉంచినట్లుగా పోలీసులు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 20లక్షల విలువైన 77 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐలు రాఘవీణ, ధన్‌వంత్‌రెడ్డి, ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐలు కోటేశ్వర్‌రావు, సిబ్బంది విష్ణు, హన్మంత్, రవి కిరణ్ పాల్గొన్నారు.

పది కిలోల గంజాయి పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 12 : మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధి యంనంపేట్ చౌరస్తా వద్ద 10 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యంనంపేట వద్ద శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారు (టీఎస్ 07 ఎఫ్‌అర్ 6515)లో 10 కిలోల గంజాయి లభించింది. వాహనంలోని వ్యక్తులను విచారించగా కరీంనగర్‌కు చెందిన ప్రణీత్(24), కాకినాడకు చెందిన సతీష్(25), మధుకుమార్(22), పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శివరాం(28), హనుమకొండకు చెందిన హేమంత్(21)లు ఆంధ్రప్రదేష్‌లోని అరకు ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి నగరశివారు ప్రాంతాల్లోని కళాశాలల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, గంజాయి, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ హెచ్చరించారు. గంజాయి రవాణ చేసినా, విక్రయించినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య, మల్కాజ్‌గిరి టాస్క్‌ఫోర్స్ సీఐ భరత్‌భూషణ్, ఎస్‌ఐలు పురుషోత్తంరెడ్డి, ధన్‌రాజ్, శ్రావణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న చైనా మాంజాలు

'పతంగుల' సంబురం.. కావొద్దు విషాదం

» నిషేధిత చైనా మాంజాతో పొంచి ఉన్న ముప్పు
» గాలిపటాలు ఎగరేయడంలో జాగ్రత్తలు తప్పనిసరి
» సంక్రాంతిని పురస్కరించుకొని విచ్చలవిడిగా చైనా మాంజాల విక్రయాలు

మొయినాబాద్ రూరల్, జనవరి 12 : సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు రంగారెడ్డి జిల్లాలో ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈక్రమంలో యువకులు, చిన్నారులు పతంగులు కొనుగోలు చేసి ఉత్సాహంగా ఎగురవేస్తున్నారు. కాగా, జిల్లావ్యాప్తంగా ఇప్పటికే పతంగుల దుకాణాలు వెలిశాయి. ముఖ్యంగా వ్యాపారులు గాలిపటాలు ఎగురవేసేందుకు వాడే చైనా మాంజా విక్రయాలు యథేచ్ఛగా చేపడుతున్నారు. దాని వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా.. ప్రజలకు

పంజా విసురుతున్న మాంజా

కాగా, సంక్రాంతిని పురస్కరించుకొని పతంగులు ఎగురవేయడంలో భాగంగా చైనా మాంజా పంజా విసురడానికి సిద్ధమవుతోంది. ఎక్కువమంది పిల్లలు ఈ మాంజానే ఉపయోగించేందుకు ఆసక్తి చూపిస్తుండడంతో మార్కెట్లో విచ్చలవిడిగా లభిస్తోంది. కానీ దీనివల్ల జరిగే ప్రమాదాలను ఎవరూ గుర్తించలేకపోతున్నారు. అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. దీన్ని విక్రయించొద్దంటూ ప్రకటనలు జారీ చేసి చేతులు దులుపుకోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. రోడ్డుపక్కనే పతంగులు ఎగరవేస్తుండడంతో మాంజా వాహనదారులకు అడ్డుగా వచ్చి వారి మెడకు చిక్కి ప్రాణాయస్థితికి వచ్చిన సంఘటనలు మండలంలో ఎన్నో ఉన్నాయి. మాంజా చెట్లు, కరెంటు వైర్లు, బిల్డింగ్‌ల మధ్య ఇరుక్కుపోవడంతో పక్షులకు.. ముఖ్యంగా వాటి కాళ్లకు చుట్టుకొని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

జోరుగా చైనా మాంజా క్రయవిక్రయాలు

జిల్లావ్యాప్తంగా పతంగుల దుకాణాలు పెద్దమొత్తంలో వెలిశాయి. పలు దుకాణాల్లో చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు సమాచారం. కాగా, దుకాణదారులు బేగంబజార్, అబిడ్స్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి మాంజాను తీసుకువచ్చి వ్యాపారం సాగిస్తున్నారు. డిసెంబరులోనే ఢిల్లీ, హరియాణా నుంచి ఈ సరుకును తీసుకువచ్చిన వ్యాపారులు గోదాముల్లో నిల్వ చేశారు. తెలిసిన వారికి చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, పోలీసులు తనిఖీలు చేపట్టడం లేదు. పండగ రోజు తనిఖీలు ఉండవని సంక్రాంతికి ముందు, తర్వాత రోజు విక్రయాలు సాగించేందుకు దుకాణదారులు సిద్ధమయ్యారు. పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

జాగ్రత్తలు పాటించాల్సిందే..

బహుళ అంతస్తుల భవనాలపై ఉండే వాటర్ ట్యాంకులపై, ప్రహరీలు లేని భవనాల అంచుల వద్ద పతంగులు ఎగురవేసేటప్పుడు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. రహదారి పక్కన, వంతెనలపై వాటిని ఎగురువేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతాయి. కరెంటు తీగలకు చిక్కుకున్న వాటిని తీసేక్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. గుట్టలు, కొండలు, చెట్ల వద్ద ఎగరవేయడం వల్ల పక్షుల ప్రాణాలకు ముప్పు వాటిల్లనుంది. ఏదిఏమైనా పతంగులు ఎగురవేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి.

మాంజా తయారీ విధానం ఇలా..

పతంగులను ఎగురవేందుకు సాధారణ దారాలతో పోలిస్తే చైనామాంజా సౌలభ్యంగా ఉంటుంది. దీన్ని స్థానికంగానే.. సింథటిక్ దారానికి గాజు పొడి, కొన్ని రసాయనాలు కలిపి తయారు చేస్తారు. ఇది చాలా పదునుగా ఉంటుంది. దీనివల్ల పక్షులు, మనుషులకు ప్రమాదం పొంచి ఉండడంతో కేంద్ర ప్రభుత్వం గతంలో దీన్ని నిషేధించింది. అయినా, వాటి విక్రయాలు మండలంలో అనేక చోట్ల జోరుగా సాగుతున్నాయి. చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



పిల్లలు గాలిపటాలు ఎగరవేసే సమయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. భవనాలపై కాకుండా భూమి మీద నుంచి ఎగురవేసేందుకు అవగాహన కల్పించాలి. కరెంటు స్థంభాలు, వైర్లపై నిలిచిపోయిన పతంగుల గురించి శ్రమించకూడదు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు గ్రామాల్లో అవగహన కల్పించాలి.

- ఎండీ ఖాజా పాషా, పీసీసీ మైనార్టీ శాఖ కార్యదర్శి, నక్కలపల్లి, మొయినాబాద్ మండలం

నిబంధనలు పాటించడం తప్పనిసరి



గాలిపటాలను ఎగురవేసే క్రమంలో నిబంధనలు పాటించాలి. నిషేధిత చైనా మాంజాను ఉపయోగించవద్దు. దీన్ని విక్రయిస్తే చర్యలు తప్పవు. భవనాలపై గాలిపటాలను ఎగరేయొద్దు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి స్పీకర్లు, సౌండ్ బాక్సులను ఏర్పాటు చేయకూడదు.

- గుడి పవన్‌కుమార్ రెడ్డి, సీఐ మొయినాబాద్

చెంచుల జీవనోపాధికి సదుపాయాలు కల్పించాలి

» జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పెద్దేముల్, జనవరి 12: చెంచుల జీవనోపాధికి అధికారులు వారికి అన్నివిధాల సదుపాయాలను కల్పించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ఈనెల 15న పీఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహణ సందర్భంగా పెద్దేముల్ మండలం చైతన్యనగర్ గ్రామంలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇప్పటి వరకు పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా జరిగిన వివిధ పనులు, జరగాల్సిన పనులపై సమీక్ష నిర్వహించారు. 15వ తేదీన ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడే అవకాశం ఉన్నందున 24గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఆధార్‌కార్డులు, విద్యుత్తు, ఇంటింటికీ నల్లాకనెక్షన్, బ్యాంకుఖాతాలు, కులధృవీకరణపత్రాలు ఇప్పటికే అందించామని, ఇంకా ఎవరైనా మిగిలిపోయిన వారు ఉంటే వారికి కూడా అన్ని సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ లలిత, గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు ఇందిరా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ, ఎల్‌డీఎం రాంబాబు, మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్, జిల్లా సంక్షేమశాఖ అధికారి లలితకుమారి, వ్యవసాయాధికారి గోపాల్, తహసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.



కొడంగల్: కడా ప్రత్యేకాధికారి కె.వెంకట్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు

డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇప్పించాలి

కొడంగల్, జనవరి 12: డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు 2వేల మందికి ఉద్యోగాలు ఇప్పించాలని కొడంగల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన అభ్యర్థులు బి.నర్సింహారెడ్డి, శైలకుమారి, ఎన్.నర్సింహులు తదితరులు కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి రాసిన వినతి పత్రాన్ని శుక్రవారం కొడంగల్ క్యాంపు కార్యాలయంలో కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రత్యేకాధికారి కుంచాల వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీ 1998లో ఉపాధ్యాయ నియామకాల్లో అధికారులు చాలా అవకతవకలకు పాల్పడి అర్హులైన అభ్యర్థుల నియామకం చేయకుండా అక్రమ మార్గాల ద్వారా కొంత మంది నాన్‌లోకల్ అభ్యర్థులను నియమించారని ఆరోపించారు. ఇటీవల ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్కడ డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు 4567 మందికి యంటీయస్ పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చి ఆదుకున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్

వికారాబాద్, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం 32మంది గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లను తొలగించిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా గురువారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ సెక్రెటరీ సురేష్‌తో గ్రంథాలయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల సంస్థ సెక్రటరీ సురేష్ బాబు, డిప్యూటీ లైబ్రరీయన్ కిషన్ పాల్గొన్నారు.



బాధ్యతలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



కందుకూరు : మీర్కాన్‌పేటలో మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న వైద్యఆరోగ్యశాఖ బృందం

మెడికల్ కళాశాల స్థలాన్ని పరిశీలించిన

వైద్య, ఆరోగ్యశాఖ బృందం

కందుకూరు, జనవరి 12 : కందుకూరు మెడికల్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని శుక్రవారం రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ కె.గోపాల్ ఆధ్వర్యంలో మండలంలోని మీర్కాన్‌పేట రెవెన్యూ పరిధిలోని 121 సర్వే నెంబర్‌లోని 20ఎకరాల భూమిని అధికారులు పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం సిద్దిపేట మెడికల్ కాలేజీ వైద్యులు విమలతామాస్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించినట్లు ఎమ్మార్వో తెలిపారు. ఆమె వెంట డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మంచాల రైతువేదిక వద్ద అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

లాభసాటి పంటలను సాగు చేయాలి

» వ్యవసాయశాస్త్రవేత్త డా.డీబీవీ రమణ
» పత్తిసాగుపై మంచాలలో రైతులకు అవగాహన

మంచాల, జనవరి 12 : లాభసాటి పంటలను సాగుచేసి రైతులు లబ్ధిపొందాలని వ్యవసాయ శాస్త్రవేత్త డీబీవీ రమణ, విజయ్‌కుమార్ అన్నదాతలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పత్తి సంస్థ నాగపూర్ వారి సహకారంతో వ్యవసాయశాఖ అధ్వర్యంలో మంచాల రైతువేదిక వద్ద వివిధ గ్రామాలకు చెందిన రైతులకు అధిక సాంద్రత ఇచ్చే పత్తిసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు చేపట్టినట్లయితే చీడపీడలు కలగకుండా, అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. సమదూరంలో విత్తనాలను విత్తడం ద్వారా ఎకరాకు 20వేల మొక్కలు నాటవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, సర్పంచ్ జగన్‌రెడ్డి, ఏవో జ్యోతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



బీఎల్‌వోలతో మాట్లాడుతున్నా ఆర్డీవో

చనిపోయిన వారి ఓట్లను తొలగించాలి

» షాద్‌నగర్ ఆర్డీవో వెంకట మాధవ రావు

కేశంపేట, జనవరి 12: చనిపోయిన వారి ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని బీఎల్వోలకు షాద్‌నగర్ ఆర్డీవో వెంకట మాధవరావు ఆదేశించారు. శుక్రవారం కేశంపేట మండల పరిషత్ కార్యాయలంలో బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ... 18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలని, ఓటరు నమోదు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునే ఫారంలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అనంతరం ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మీర్ అజాంఅలీ, డీటీ గీత తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయాలి

మాడ్గుల, జనవరి 12 : రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి మంచి లాభాలు పొందవచ్చని ఉద్యానవన శాఖ అధికారి కనకలక్ష్మి తెలిపారు. మండలంలోని కొల్కులపల్లి గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని పంటలకంటే ఆయిల్ పామ్ సాగుకు తక్కువ పెట్టుబడి అవుతుందని, ఎక్కువ లాభాలు పొందవచ్చని సూచించారు. మాడ్గుల మండలంలో దాదాపు 1500ఎకరాలు సాగుచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 90శాతం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్‌పై 80శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. కాగా, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ ఉంటుందన్నారు. అవగాహన సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి నవ్య, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్, సర్పంచ్ అనురాధాకిషన్‌రెడ్డి, నాగిళ్ల మాజీ ఎంపీటీసీ సత్తయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ : లింగారెడ్డిగూడలో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బక్కని నర్సింలు

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

● స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా నివాళులు ● పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు


షాబాద్/మొయినాబాద్ రూరల్, జనవరి 12 : స్వామి వివేకనందుడి బోధనలు యువతకు స్ఫూర్తిని నింపుతూనే ఉంటాయని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. వివేకానందుని 161వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం షాబాద్, మొయినాబాద్ మండలాల్లో పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. హిమాయత్ నగర్‌లో కాంగ్రెస్ లీగల్‌సెల్ అధ్యక్షుడు బైకని కుమార్ యాదవ్ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానందుడి విగ్రహానికి కాంగ్రెస్ నేత భీంభరత్ పూలమాల వేసి నివాళులర్పించారు. షాబాద్ మండల కో ఆర్డినేటర్ దాదె మహేశ్, నాయకులు ముదిగొండ రవియాదవ్, నాయకులు భాస్కర్, అశోక్, చరణ్, చందు, జంగయ్య, నర్సింలు, భాను, నాని, ఎం.రవియాదవ్, లీగల్‌సెల్ మండలాధ్యక్షుడు కుమార్‌యాదవ్, గ్రామాధ్యక్షుడు రమేష్, ప్రకాష్, శాంతియువజన సంఘం అధ్యక్షుడు బుర్రకాయల నరేష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కంజర్ల శేఖర్, సీనియర్ నాయకులు పైలు శ్రీనివాస్, బాబురావు, కేబుల్ రాజుగౌడ్, ధన్‌రాజు, షాబాద్ అర్జున్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చేవెళ్ల : భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని ప్రముఖ వక్త భాస్కర యోగి అన్నారు. స్వామి వివేకాంద జయంతి సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాల వార్షికోత్సవ వేడుకలను సీహెచ్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ప్రముఖ వక్త భాస్కర యోగి, సినీ గాయకులు రవి వర్మ, జబర్దస్త్ హాస్యనటుడు రచ్చ రవి పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సి.జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, కళాశాల కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి : భారత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప మహనీయుడు స్వామి వివేకానంద జీవితం యువతకు మార్గదర్శకమని ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్, చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్యలు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏబీవీపీ ఆమనగల్లు మండల శాఖ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహం వద్ద వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. బీజేపీ, ఏబీవీపీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులున్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్, వివేకానంద యువజన సంఘం, యువజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, నాయకులు తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో జయంతి వేడుకలు నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి నీలకంఠ పాండు హాజరయ్యారు. నాయకులు విజయ్, భరత్, గిరి, మనోహర్, తదితరులున్నారు. వెల్జాలలో వివేకానంద యూత్ అధ్యక్షుడు ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



శంషాబాద్ రూరల్ : వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న లక్ష్మీనివాస్



ఆమనగల్లు : జయంతిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

కేశంపేట : యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహానికి జడ్పీటీసీ, తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. కొత్తపేటలో మాజీ ఎంపీటీసీ నర్సింహాయాదవ్ వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, సురేష్‌రెడ్డి, రాము లు, పర్వతాలు, యెన్నం శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమేష్, శివాజీ, యుగందర్, మోటె శ్రీనివాస్, హన్మంత్‌రెడ్డి, అబ్బి సుందరయ్య, తదితరులున్నారు.

కొందుర్గు : స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని గంగన్నగూడెం ఉపసర్పంచ్ చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. గంగన్నగూడెంలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వివేకానంద జయంతిని నిర్వహించారు. వివేకానంద సేవా సమితి గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు యాదవ్, చిట్టెం సత్యనారాయణరెడ్డి, నవాదిరెడ్డి, చిన్నయ్య, కృష్ణయ్య, ఎస్ యాదయ్య, సంజీవరెడ్డి, విజయ్, యాదగిరి, అంజయ్య, శ్రీనివాస్, మధు, వెంకటయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

యాచారం : స్వామి వివేకానంద ఆశయ సాధన కోసం యువత పాటు పడాలని మండల బీజేపీ నాయకుడు ముంత జంగయ్యయాదవ్ కోరారు. యాచారంలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాల్‌లో ఏబీవీపీ నాయకులు డి.శివకృష్ణ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు నరేందర్, శాంతికుమార్, నరేందర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, ఏబీవీపీ నాయకులు నరేందర్, గణేష్, వంశీ, రవి తదితరులున్నారు.

షాద్‌నగర్ : వికసిత్ భారత్ లక్ష్య సాధనకు యువతే కీలకమని బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు ఏపీ మిథున్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రైతు కాలనీలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు రమేష్, బీజేపీ నియోజకవర్గ నాయకులు అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, నాయకులు పి.సాయిప్రకాష్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, పి వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, శుక్రవర్ధన్‌రెడ్డి, బాల్‌రాజ్, రమేష్, జగదీష్, మల్లేష్, పృథ్వీరాజ్, శివ, వంశి, అజయ్, వినయ్, కిరణ్‌రెడ్డి, దిలీప్, సునిల్, విజయ్ తదితరులున్నారు. కాగా, స్వామి వివేకానందుడి మాటలు అక్షర సత్యాలని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లింగారెడ్డి గూడెంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. థామస్, సర్పంచ్ బి.మాధవి, ఎంపీటీసీ రామకృష్ణ, మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, కె అంజయ్య గౌడ్, లక్ష్మయ్య, ఎ చంద్రయ్య, జి శంకరయ్య, నర్సింలుగౌడ్, బి శ్రీనివాస్, ఎ.రామకృష్ణ, కృష్ణయ్య, యాదయ్య, అశోక్‌గౌడ్, వెంకటయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు కందడి శ్రీరామ్‌లు అన్నారు. శుక్రవారం స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకొని మండలంలోని దెబ్బడగూడ, మండల కేంద్రంలో వివేకానంద చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ నాయకులు డిల్లీ భానుప్రసాద్, మనికుమార్, మండల కన్వీనర్ సాయి, జగదీష్, నాయకులు ఎల్మటి దేవేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్ : వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భీంభరత్, తదితరులు

శంషాబాద్ : యువత దేశానికి వెన్నముక అని, వివేకానందను యువత ఆదర్శంగా తీసుకుని భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలవాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ మాధవరెడ్డి అధ్వర్యంలో జరిగిన వివేకుడి జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేష్, టీఎస్ఎస్‌వో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ, కమిటీ సభ్యులు గంగాధర్‌గౌడ్, రవి తేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్‌రత్నం అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో నిర్వహించారు. వివేకానంద జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వివేకుడి విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని మహిళలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ లక్ష్మన్‌కుమార్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు అ మరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భరత్ గ్రామస్తులున్నారు.



కందుకూరు : దెబ్బడగూడలో నివాళులర్పిస్తున్న పాల్గొన్న జంగారెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి

● సంపు మోటారు ఆన్ చేస్తుండగా ఘటన

● సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చి, తిరిగిరాని లోకానికి..

తలకొండపల్లి, జనవరి 12: సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన ఓ గిరిజన విద్యార్థిని విద్యాఘాతానికి గురై మృతి చెందింది. మండలంలోని హర్యానాయక్ తండాలో శుక్రవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హర్యానాయక్ తండాకు చెందిన మూడావత్ శంకర్-శాంతి దంపతుల కూతురు నందిని(13) తలకొండపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ(గిరిజన)లో 8వ తరగతి చదువుతోంది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో నందిని గురువారం హర్యానాయక్ తండాకు వచ్చింది. కాగా, నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్ద సంపు మోటార్‌ను ఆన్‌చేసే క్రమంలో పక్కన తేలివున్న కేబుల్ వైరు నందినికి తాకడంతో విద్యుత్ ప్రమాదానికి గురైంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సంక్రాంతి వేళ ఇంటికి వచ్చిన విద్యార్థిని కానరాని లోకాలకు వెళ్లడంతో హర్యానాయక్ తండాలో విషాదం చోటుచేసుకుంది.

పరిశ్రమలో కార్మికుడు..

షాద్‌నగర్, జనవరి 12: విద్యుదాఘాతంతో పరిశ్రమలో కార్మికుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని అన్నారంలో శుక్రవారం జరిగింది. నందిగామ మండల కేంద్రానికి చెందిన అంజిరెడ్డి, అన్నారంలోని జంటెక్ బాల్మిల్ పరిశ్రమలో కొంతకాలం నుంచి పనిచేస్తున్నాడు. శుక్రవారం పరిశ్రమలో పని చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

శ్రీగంధం చెట్ల నరికివేత

● రూ.80లక్షల విలువైన దుంగలు అపహరణ

● నెల వ్యవధిలో రెండుసార్లు అఘాయిత్యం

● ఐదు గొర్రెలనూ ఎత్తుకెళ్లిన దుండగులు

యాచారం, జనవరి 12 : గడ్డమల్లాయగూడలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు బీభత్సం సృష్టించారు. ఆరుగురు రైతుల వ్యవసాయ బావుల వద్ద 15 శ్రీ గంధం చెట్లను నరికి సుమారు రూ.80లక్షల విలువైన దుంగలను దొంగిలించారు. అలాగే అచ్చన వెంకటయ్య అనే గొర్లకాపరికి చెందిన ఐదు గొర్రెలను అపహరించారు. ఇలాంటి ఘటన జరిగి నెల గడవక ముందే దుండగులు మరోసారి దొంగతనం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. బోజిరెడ్డి పొలంలో 15 శ్రీగంధం చెట్లుండగా రెండు చెట్లను, చంద్రయ్య పొలంలో పది శ్రీ గంధం చెట్లుండగా 4, రాజశేఖర్‌రెడ్డి పొలంలో 10 శ్రీగంధం చెట్లుండగా 3, వెంకటరెడ్డి పొలంలో 8 శ్రీ గంధం చెట్లుండగా ఒక చెట్టును, రాకేష్‌రెడ్డి పొలంలో 8 శ్రీగంధం చెట్లుండగా 2, యాదగిరి పొలంలో 10 శ్రీ గంధం చెట్లుండగా 3చెట్లను దుండగులు నరికివేశారు. బైక్‌లపై వచ్చి తమ పని చేసుకొని వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అంతకు ముందు మద్యం సేవించి విందు చేసుకున్నట్లు, సంఘటనా స్థలంలోని మద్యం బాటిళ్లను పోలీసులు గుర్తించారు. కాగా, గంధం చెట్లను నరికి తీసుకెళ్లే క్రమంలో దుండగులు అచ్చన వెంకటయ్య అనే వ్యక్తికి చెందిన గొర్లమందలో రెండు గొర్రె పొట్టేళ్లతో పాటు మూడు గొర్లను అపహరించారు. వాటివిలువ రూ.45 వేలు ఉంటుందని బాధితుడు వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత డిసెంబరు 24న రాత్రి నలుగురు రైతుల పంట పొలాల్లోని శ్రీగంధం చెట్లను నరికి అపహరించిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య, ఎస్ఐ వెంకటనారాయణ చెప్పారు.

ఆయోధ్య అక్షింతలతో ర్యాలీ

ఆమనగల్లు, జనవరి 12 : మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండా, ఎర్రబీక్య తండా, నుచ్చుగుట్ట తండా, బర్రోనిబావి తండా, వేముల కుంట తండాలలో శుక్రవారం ఆయోధ్య అక్షింతలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంపాల్ నాయక్ ర్యాలీని ప్రారంభించారు. అంతకుముందు ఆయా తండాల్లోని ఆలయాల్లో అక్షింతలతో పూజలు నిర్వహించారు. అనంతరం గడప గడపకూ తిరిగి ఆయోధ్య రామాలయం నుంచి వచ్చిన తలంబ్రాలను పంపిణీ చేశారు. బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ మీడియా ఇన్‌చార్జి రవిరాథోడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండె సాయి, నాయకులు దొంతు సత్యనారాయణ, నయనాచారి, సీహెచ్ లక్ష్మణ్, గోరటి నర్సింహ, బాలు, చత్రు, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, తండా నాయకులు తదితరులున్నారు.

ఘనంగా ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

కడ్తాల్/తలకొండపల్లి, జనవరి 12: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కడ్తాల మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ కూడలిలో కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. చేగూరి వెంకటేష్, గూడూరు భాస్కర్‌రెడ్డి, జహంగీర్ బాబా, లక్ష్మయ్య, మల్లేశ్‌గౌడ్, రాంచందర్ నాయక్, క్యామ శేఖర్, మల్లయ్య, భిక్షపతి, చందోజీ, యాదయ్య, అస్గర్‌అలీ, మహేశ్, కృష్ణ, రాజేశ్, ఇమ్రాన్‌బాబా తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రియాంక జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరై కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజయ్య, నాయకులు అజీం, శ్రీశైలం, జనార్ధన్, రవీందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తలకొండపల్లి, జనవరి 12 : చంద్రధన గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వివిధ పథకాల కింద రూ.కోటి నిధులతో చేపట్టిన పనులను సర్పంచ్ బక్కికుమార్ ప్రారంభించారు. సమిష్టి కృషి తోనే అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట : మల్‌రెడ్డి

మంచాల, జనవరి 12 : పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని ఇబ్రహీపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించి వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. జాపాలలో జ్యోతిరావు పూలే, మంచాలలో చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. బోడకొండ, ఎల్లమ్మ తండాలో రూ.5లక్షలతో చేపట్టే సీసీ రోడ్డుపనులకు శంకుస్థాపన చేశారు. వీఆర్‌వన్ ఫౌండేషన్ అధ్వర్యంలో నిరుద్యోగ యువతకోసం ఏర్పాటుచేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. మంచాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీపీ నర్మద, జెడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డి, సర్పంచులు జగన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అలివేలు, సపావట్‌పద్మ, నాహీద్‌బేగం, జాటోత్ అలివేలు, ఎంపీటీసీలు ఎడమ నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయానందం, వాజీద్, అధికారులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : భాగ్యనగర్‌కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

దశలవారీగా ప్రజాసమస్యల పరిష్కారం

ఇబ్రహీంపట్నం : దశలవారీగా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి అన్నారు. మునిసిపాలిటీ 8వవార్డు భాగ్యనగర్ కాలనీలో పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. మాస్టర్ ప్లాన్ రూపొందించి డ్రైనేజీ నిర్మించాలని కమిషనర్ రవీంద్రసాగర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. చైర్‌పర్సన్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ బాధిత రైతులను ఆదుకుంటాం

యాచారం : ఫార్మాసిటీ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని, ఇచ్చిన హామీ మేరకు ఫార్మాసిటీ బాధిత రైతులను ఆదుకుంటామని మల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో 22 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, వైస్‌ఎంపీపీ కె, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

కడ్తాల్, జనవరి 12 : ప్రతిభ ఆధారంగానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు, యువత క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి గుర్తింపు పొందాలని కోరారు. కడ్తాల మండలం బోయిన్‌గుట్ట తండాలో వారంరోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం సాయంత్రం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హజరయ్యారు. మొదటి బహుమతి చరికొండ, రెండవ బహుమతి బోయిన్‌గుట్ట తండాలు గెలుపొందాయి. విజేత జట్లకు స్థానిక నాయకులు , నిర్వాహకులతో కలిసి శ్రీనివాస్ రెడ్డి షీల్డ్‌లు, నగదు బహుమతులను అందజేశారు. నాయకులు సురమల్ల సుభాష్, చలిచీమల సతీష్, మహేందర్, సోమ్లు, శ్రీను, బాలాజీ, వినోద్, శ్రీను, ఈశ్వర్, హన్య, ప్రవీణ్, అంజినాయక్, తదితరులున్నారు.

గ్రామీణ క్రీడాకారులు ప్రతిభ చాటాలి

కేశంపేట, జనవరి 12: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలని కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో కేశంపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, మాజీసర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి, అల్వాల ఎంపీటీసీ లంకాల సురేష్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

యాచారం, జనవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తోందని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ ఎస్ఐ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మేడిపల్లిలో సంక్రాంతి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆటల పోటీలు యువతలో ఐకమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. గెలుపోటములు సహజమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు యువకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ

కడ్తాల్, జనవరి 12: మండల పరిధిలోని మక్తమాదారంలో శుక్రవారం స్థానిక యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా యువజన సంఘాలకు క్రికెట్, వాలీబాల్ కిట్లు మంజూరయ్యాయి. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ సులోచన సాయిలు స్థానిక నాయకులతో కలిసి వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంజులా చంద్రమౌళి, స్థానిక వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తలకొండపల్లి, జనవరి 12: యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలంలోని వెల్జాలలో సంక్రాంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన వీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం క్రీడాకారులు, స్థానిక నాయకులతో కలిసి శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన వానరాశి వెంకటేశ్, క్రీడాకారులకు సమకూర్చిన దుస్తులు పంపిణీ చేశారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రవి, ఆర్గనైజర్లు అబ్బాస్, రాము, ఎంపీటీసీ అంబాజీ, ఉపసర్పంచ్ అజీజ్, వార్డుసభ్యులు, నాయకులున్నారు.

కొందుర్గులో నేడు, రేపు వాలీబాల్ టోర్నమెంట్

కొందుర్గు, జనవరి 12: మండల కేంద్రంలో రెండు (నేడు, రేపు) రోజుల పాటు నిర్వహించే 17వ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎ.కృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతారని చెప్పారు. టోర్నమెంట్ రెండు విభాగాల్లో జరుగుతుందని.. ఓపెన్ టూ ఆల్ విభాగంలో ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, టోర్నమెంట్ బెస్ట్ టీంకు రూ.5వేలు, రూరల్ విభాగంలో ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ రూ.5వేలు, బెస్ట్ టీంకు రూ.3వేలు అందజేయనున్నట్లు తెలిపారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య

ప్రతీఒక్కరు రక్తదానం చేయాలి

ఆమనగల్లు, జనవరి 12: ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలు కోరారు. రక్త, నేత్ర, అవయవ దానాలపై ప్రజలు అపోహలు వీడాలన్నారు. ఆమనగల్లు పట్టణంలోని గాంధీచౌక్ వద్ద శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రామ్ నాయక్, కమిషనర్ శ్యామ్‌సుందర్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ ప్రముఖ్ రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీరామ్‌లతో కలిసి చైర్మన్ శిబిరాన్ని ప్రారంభించారు. 102మంది రక్తదానం చేయగా.. ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు గోరటి నర్సింహ, బైకని శ్రీశైలంయాదవ్, శ్రీకాంత్ సింగ్, సుందూరు శేఖర్, విజయ్‌కృష్ణ, కండె సాయి, మొక్తాల వెంకటయ్య, వడ్డె రాజు, వరికుప్పల శ్రీను, ఎర్రవోలు మహేశ్, కట్టు మల్ల విజయ్, శ్రీను, ప్రవీణ్, ఆనంద్, ఏబీవీపీ నాయకులు ఏబీవీపీ నాయకులు లండం మల్లేశ్, కొత్ర సురేశ్, రేవంత్, మొక్తాల సాయి, మల్లేశ్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాము జన్మదిన వేడుకలు

ఆమనగల్లు, జనవరి 12: లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు వివేకానంద స్టాచ్యు, శ్రీ సరస్వతి శిశు మందిర్, శ్రీనివాస కాంప్లెక్స్‌లలో నిర్వహించిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాల నేతలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాము కేక్ కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. ప్రజాప్రతినిధులు, నాయకులు రాము ను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి, జనవరి 12: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామంలో రూ. 50 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు వాటర్ ట్యాంక్‌లు, సీసీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ, వంటశాలను సర్పంచ్ రమేశ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. నారాయణరెడ్డిని ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. మేరళ్ల గడ్డ తండాకు బీటీ రోడ్డు నిర్మాణం చేయిస్తానని, వెంకటాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తానని తెలిపారు. గ్రామస్థుల కోరిక మేరకు ముదిరాజ్ భవన నిర్మాణానికి రూ.5లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు రమేశ్, సుధాకర్‌రెడ్డి, సునీత సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీకాంత్, డీఈఈ శ్రీనివాస్‌లు, ఏఈలు విద్యాసాగర్, రవితేజ, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాములు, నాయకులు మిట్టపల్లి అంజయ్య గుప్త, మోహన్‌రెడ్డి, అజీం, శ్రీశైలం, భగవాన్ రెడ్డి, తదితరులున్నారు.

ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభం మీడియా



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పామెన భీంభరత్, రాజు తదితరులు

షాబాద్, జనవరి 12 : ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం మీడియా అని, హక్కులపై ప్రజలను చైతన్యపరుస్తూ వాటి పరిరక్షణ కోసం మీడియా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం షాబాద్‌లో 'ఆంధ్రజ్యోతి'-2024 క్యాలెండర్‌ను పార్టీ సీనియర్ నాయకులు సబ్బరిగారి రాజు, అక్తర్‌పాషలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిజాలను నిర్భయంగా రాస్తున్న ఆంధ్రజ్యోతిని అభినందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

పేదలకు అండ సీపీఐ

చేవెళ్ల, జనవరి 12 : పేదలకు సీపీఐ నిరంతరం అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని మల్లారెడ్డి గూడ స్టేజీ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి 98 సంవత్సరాలు అవుతున్నదన్నారు. కార్మికులు, కర్షకుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నదన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేఖ విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మంజుల, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, సత్తయ్య, విఠలయ్య, నర్సింలు, అంజయ్య, శ్రీనివాస్, శివకృష్ణచారి, ఆనంద్, శ్రీశైలం, లలిత, యాదమ్మ, వెంకటమ్మ, సుగుణమ్మ, స్వరూప, ప్రియ, బాలమణి తదితరులు ఉన్నారు.



జెండా ఎగురవేస్తున్న రామస్వామి